క్లుప్తంగా

కృష్ణయ్యకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న కృష్ణయ్య

యాచారం: నక్కర్తమేడిపల్లి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జోగు కృష్ణయ్యకు డాక్టరేట్ వచ్చింది. సామాజిక కవిత్వం–ఉత్తమ బోధనలో విశేష కృషి చేసినందుకు గాను ఢిల్లీ వెబ్బిక్ ఇంటర్ నేషనల్ యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. హైదరాబాద్ నగరంలో సోమవారం తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి కమిటీ చైర్మన్ సముద్రాల వేణుగోపాలచారి, వర్సిటీ ప్రొఫెసర్లు కృష్ణయ్యకు డాక్టరేట్‌ను అందజేశారు.

పోల్కంపల్లి విద్యార్థుల సత్తా

- నిఖిలేంద్రకు గోల్డ్ పతకం
- ప్రేమ్‌సాయికి సిల్వర్ మెడల్



ప్రేమ్‌సాయి, నిఖిలేంద్రను అభినందిస్తున్న మాస్టర్లు

ఇబ్రహీంపట్నం రూరల్: అంతర్జాతీయ కరాటే పోటీల్లో పోల్కంపల్లి విద్యార్థులు సత్తా చాటారు. బంగారు, సిల్వర్ మెడల్స్ సాధించి ఆదర్శంగా నిలిచారు. ఆదివారం నగరంలోని జరిగిన 2వ అంతర్జాతీయ కరాటే పోటీల్లో అండర్ 15 విభాగంలో పోల్కంపల్లి గ్రామానికి చెందిన ప్రేమ్‌సాయి (హెచ్‌ఆర్‌డీ స్కూల్ విద్యార్థి) సిల్వర్ మెడల్ సాధించాడు. అండర్ 13 విభాగంలో విద్యార్థి నిఖిలేంద్ర గోల్డ్‌మెడల్ సాధించాడు. టస్మో ఇండియా చైర్మన్ సత్య శంకర్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. డిసెంబర్ 31న జరిగే అంతర్జాతీయ నేపాల్ కరాటే పోటీలకు ప్రేమ్‌సాయి ఎంపికయ్యాడు. కరాటేలో ప్రవీణ్యం సాధించి గ్రామానికి గుర్తింపు తెచ్చిన విద్యార్థులను, కరాటే మాస్టర్ రాజశేఖర్‌ను గ్రామస్తులు అభినందించారు.

ఆశ కార్యకర్తల అరెస్ట్

ఆమనగల్లు: ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, రిటైర్మెంట్ బెనిఫిట్స్ తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు రాష్ట్రవ్యాప్తంగా సమ్మెబాట పట్టారు. అయితే ప్రభుత్వం స్పందించకపోవడంతో సోమవారం చలో అసెంబ్లీకి పిలుపునిచ్చారు. ఈ నేపథ్యంలో పోలీసులు ముందస్తుగా కార్యకర్తలను అరెస్టు చేశారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడిచిపెట్టారు.

కొనసాగుతున్న సమ్మె

ఆమనగల్లు పట్టణంలో సమస్యలను పరిష్కరించాలని మధ్యాహ్న భోజన పథకం కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. కార్మికులు చేపట్టిన సమ్మె సోమవారం నాటికి 12వ రోజుకు చేరుకుంది. సమ్మెకు సీఐటీయు జిల్లా నాయకులు కురుమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు వెంకటయ్య మద్దతు తెలిపారు.

కానిస్టేబుల్ అభ్యర్థులకు సన్మానం

కడ్తాల్: టీఎస్‌ఎల్‌పీఆర్‌బీ ఫలితాల్లో మండలంలోని మైసిగండి గ్రామానికి చెందిన సర్దార్‌నాయక్, కల్యాణ్‌నాయక్, ప్రవీణ్‌నాయక్ పోలీస్ ఉద్యోగాలు సాధించారు. ఈ మేరకు సోమవారం గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీజేపీ నాయకుడు రాందాస్‌నాయక్ ఆధ్వర్యంలో యువకులను ఘనంగా సన్మానించారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: విద్యార్థి దశ నుంచే లక్ష్యాన్ని ఎంపిక చేసుకోవాలని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని జూలపల్లికి చెందిన వెంకటేష్‌గౌడ్ కానిస్టేబుల్‌గా ఎంపికయ్యాడు. సోమవారం ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో వెంకటేష్‌గౌడ్‌ను ఘనంగా సన్మానించారు.

భవన నిర్మాణానికి భూమి పూజ

తుర్కయంజాల్: కుల సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తెలిపారు. తుర్కయంజాల్‌లోని సర్వే నంబర్ 637లో కురుమ సంఘం, గౌడ సంఘం భవన నిర్మాణ పనులకు సోమవారం ఆయన భూమి పూజ నిర్వహించారు. ఈ సమాజికవర్గాలకు చెరో 30 గుంటల భూమిని కేటాయిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, కురుమ సంఘం సభ్యుడు బాబయ్య, గుండ రాములు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తల అభీష్టం మేరకు నడుచుకుంటా

కడ్తాల్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల అభీష్టం మేరకు తాను నడుచుకుంటానని ఆ పార్టీ నియోజకవర్గ నాయకుడు రాఘవేందర్‌రెడ్డి ప్రకటించారు. సోమవారం మండల కేంద్రంలోని కేశవ రెడ్డి గార్డెన్‌లో రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కడ్తాల్ మండల కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ అధికార పార్టీలో ఉండి ఆరేళ్లుగా ఎటువంటి అభివృద్ధి చేయని నాయకులు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలోకి వచ్చి సాధించేది ఏముందని ప్రశ్నించారు. సమావేశంలో జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికాంత్‌గౌడ్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌గౌడ్, మాజీ ఆమనగల్లు మండల అధ్యక్షుడు రాములుతదితరులు ఉన్నారు.

మోగిన ఎన్నికల ‘నగారా’

- అమల్లోకి వచ్చిన నిబంధనలు
- అప్రమత్తమైన అధికారులు
- పార్టీ బ్యానర్లు, ఫ్లెక్సీల తొలగింపు



ఇబ్రహీంపట్నంలో ఫ్లెక్సీలు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ ఎన్నికల నగారా మోగడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. కోడ్ తో నిబంధనలు అమలులోకి వస్తాయని పేర్కొన్నారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ ఆదేశాలతో బ్యానర్లను, కటౌట్లు, ఫ్లెక్సీలను సోమవారం సాయంత్రం నుంచి సిబ్బంది తొలగిస్తున్నారు. ఎన్నికల నిబంధలనలకు వ్యతిరేకంగా ఎలాంటి కార్యాక్రమాలు చేపట్టవద్దని అధికారులు సూచిస్తున్నారు. పక్షం రోజుల నుంచి వివిధ అభివృద్ధి పనులకు అధికార పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు చేస్తున్న శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు సోమవారం మధ్యాహ్నం నుంచి బ్రేక్ పడింది. ఎన్నికల కోడ్ వస్తుందని ముందే తెలియడంతో 12 గంటల లోపు హడావిడిగా అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కల్యాణలక్ష్మి,షాదిముబారక్,బతుకమ్మ చీరల పంపిణీ, సీసీ రోడ్లు, వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పక్షాలు, ప్రజలు సహకరించాలని అధికారులు కోరుతున్నారు.

కోడ్ కూసింది.. తనిఖీలు షురూ

యాచారం: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. కేంద్ర ఎన్నికల సంఘం అసెంబ్లీ ఎన్నికల తేదీల ప్రకటన నేపథ్యంలో సోమవారం యాచారం పోలీసులు సాగర్‌రోడ్డుపై వాహనాల తనిఖీలు చేపట్టారు. మాల్ కేంద్రం, యాచారం పోలీస్ స్టేషన్ ఎదుట, గునుగల్ గేట్, నక్కర్తమేడిపల్లి గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ పరిధిలోని నక్కర్తమేడిపల్లి రూట్లో కార్లను, ద్విచక్రవాహనాలను తనిఖీలు చేశారు. ఎన్నికల నింబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని యాచారం, గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ల సీఐలు సైదయ్య, రామాంజనేయులు హెచ్చరించారు.

‘దళితబంధు’ ఎంపికలో అవకతవకలు

- అర్హులకే కేటాయించాలి
- కాంగ్రెస్ నాయకుల డిమాండ్
- అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా
- వినతిపత్రాలు అందజేత

కడ్తాల్: దళితబంధు లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆరోపిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నేతలు మాట్లాడుతూ అర్హులకు అన్యాయం జరుగుతుందని విమర్శించారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు, నాయకులనే ఎంపిక చేస్తున్నారని, అర్హులైన లబ్ధిదారులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ తీరు మారకుంటే ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. అనంతరం ఆర్డీఓ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, ఎస్సీసెల్ తాలుకా అధ్యక్షుడు రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

రైతు సమితి జిల్లా సభ్యుడిగా శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: రైతు సమన్వయ సమితి జిల్లా సభ్యుడిగా బాచిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి అధికారికంగా వచ్చిన నియామక పత్రాన్ని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు వీరయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు ఉన్నారు.



శ్రీనివాస్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

బీఆర్‌ఆర్ సహకారం అభినందనీయం

- ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్
- ఉప్పరిగూడలో ప్రభుత్వ పాఠశాల ప్రారంభం



పాఠశాలను ప్రారంభించిన కృపేష్, రాంరెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ పాఠశాల నిర్మాణానికి బూడిద రాంరెడ్డి సహకారం చాలా గొప్పదని ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని ఉప్పరిగూడ గ్రామంలో రాంరెడ్డి సొంత ఖర్చులు రూ.26 లక్షలు, దాతలు రూ.25 లక్షలు, ప్రభుత్వం రూ.7 లక్షలతో నిర్మించిన పాఠశాల అదనపు గదులను కృపేష్, జిల్లా సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు రాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సూచన, సహకారం మేరకు అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. గ్రామంలో ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి రూ.15 లక్షలు వెచ్చించి ఉచితంగా తాగునీరు అందిస్తున్నామని తెలిపారు. అలాగే గ్రామ అభివృద్ధిలో రాంరెడ్డి పాత్ర కీలకంగా ఉందని కృపేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ సత్తయ్య, ఉప సర్పంచ్ నర్సింహారెడ్డి, వార్డు సభ్యులు మహేందర్, శ్రీను, మండల విద్యాధికారి వెంకట్‌రెడ్డి, ఏఈ ఇంద్రాసేనారెడ్డి, నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, యాదగిరిగౌడ్, లక్ష్మారెడ్డి, సంజీవరెడ్డి, చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కులవృత్తులు, చేతివృత్తులకు సాయం

జెడ్పీటీసీ అనురాధ

ఆమనగల్లు: నిరుద్యోగ యువతీ యువకులు స్వయం ఉపాధితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ సూచించారు. ఆమనగల్లు పట్టణంలో బీసీ ఆర్థికసాయం పథకం కింద మంజూరైన సెలూన్, విఠాయిపల్లి గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన టీ స్టాల్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా అనురాధ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కులవృత్తులు, చేతివృత్తుల వారికి సాయం అందిస్తోందని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పత్యానాయక్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాములుయాదవ్, నాయకులు భాస్కర్, పురుషోత్తం, జగన్, శేఖర్, మహేశ్, గణేశ్, మండల వడ్డెర సంఘం అధ్యక్షులు మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండలంలో 85 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదిముబారక్ చెక్కులను ఎంపీపీ కృపేశ్ సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పాదయాత్రను విజయవంతం చేయండి

ఆమనగల్లు: శీతాకాల పార్లమెంటు సమావేశాలలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చేపట్టిన మాదిగల విశ్వరూప పాదయాత్రను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు కృష్ణమాదిగ పిలుపునిచ్చారు. ఆమనగల్లు పట్టణంలోని సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పాదయాత్ర అలంపూర్ నుంచి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో చంద్రకిరణ్ మాదిగ, మల్లేశ్, మైసయ్య ఎమ్మార్పీఎస్ నాయకులు కిరణ్‌పూలే, శ్రీకాంత్, వడ్డె రాజు, విజయ్‌చందర్, మహేందర్, గెలువయ్య తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీ ఎప్పుడు?

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని ఆమనగల్లు మండలంలో వెంటనే చేపట్టాలని గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆమనగల్లు పట్టణంలోని పశువైద్యశాల ఎదుట గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. పథకం కోసం డీడీలు కట్టినా పంపిణీ చేపట్టడం లేదని, ఎప్పుడు పంపిణీ చేస్తారని ప్రశ్నించారు. అనంతరం పశువైద్య కేంద్రంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీశైలంయాదవ్, పెంటయ్య, శ్రీను, రాములుయాదవ్, కృష్ణయ్య, వెంకటయ్య, నర్సింహ, శ్రీకాంత్, వెంకటేశ్, శివశంకర్, పవన్, చంద్రయ్య తదితరులు ఉన్నారు.

మండలాన్ని సాధించుకుంటాం

తలకొండపల్లి: గట్టుఇప్పలపల్లిని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని జేఏసీ నాయకుడు రేణురెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జలదీక్షతో వినూత్న నిరసన చేపట్టారు. ఆందోళన చేస్తాం–మండలాన్ని సాధించుకుంటామని స్పష్టం చేశారు. గట్టుఇప్పలపల్లిని మండలం కేంద్రంగా ప్రకటించాలని జేఏసీ నాయకులు చేపట్టిన రిలేనిరాహార దీక్షలు సోమవారానికి 99 రోజులకు చేరుకున్నాయి.

దీక్ష విరమణ

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసుల ఆదేశాల మేరకు సాయంత్రం జేఏసీ నాయకులు దీక్షలు విరమించారు.

కేసీఆర్‌కు హ్యాట్రిక్ ఖాయం



ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

- అభివృద్ధిని చూసి పార్టీలో చేరుతున్నారు
- కల్వకుర్తిలో గులాబీ జెండా ఎగురవేస్తాం
- ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్
- బీఆర్‌ఎస్‌లో చేరికలు

తలకొండపల్లి: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హ్యాట్రిక్ సాధించి మరోసారి సీఎంగా అధికారంలోకి రావడం ఖాయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ధీమా వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధితో బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. మండలంలోని రాంపూర్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు సోమవారం జైపాల్ యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. పాలమూరు–రంగారెడ్డి పథకంతో ఈ ప్రాంతం సస్యశ్యామలమవుతుందని చెప్పారు. ఈ ప్రాజెక్టు ద్వారా కల్వకుర్తి నియోజకవర్గానికి లక్షా 50 వేల ఎకరాలకు సాగునీరు అందనుందన్నారు. మహాత్మగాంధీ ఎత్తిపోతల ప్రాజెక్టు ద్వారా ఇప్పటికే లక్షా ఎకరాలకు సాగునీరు అందుతోందని గుర్తుచేశారు. కల్వకుర్తిలో మరోసారి గులాబీ జెండా ఎగుర వేస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శ్రీనివాసురెడ్డి, ఎంపీపీ నిర్మల, గ్రామ కమిటీ అధ్యక్షుడు చిన్న హరిమోహన్‌రెడ్డి, యాదయ్య, శ్రీశైలం, ఆంజనేయులు, నరసింహారెడ్డి, జంగయ్య, రామదాసు, పెంటయ్య, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ సమావేశం రసాభాస

- వాగ్వావాదానికి దిగిన కౌన్సిలర్లు
- చైర్‌పర్సన్‌తో వ్యతిరేకంగా నినాదాలు

తుర్కయంజాల్: మున్సిపల్ చైర్‌పర్సన్ అనురాధ అధ్యక్షతన సోమవారం రాగన్నగూడలోని వార్డు కార్యాలయంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశం రసాభాసకు దారితీసింది. ఎజెండా ఇవ్వకుండా కౌన్సిల్ సమావేశం ఎలా నిర్వహిస్తారని బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు చైర్‌పర్సన్‌తో వాగ్వావాదానికి దిగారు. ఇద్దరు మహిళా కౌన్సిలర్లు అనురాధ చేతిలోని మినిట్స్ బుక్‌ను చించివేయడంతో ఉద్రిక్తతకు దారితీసింది. అనంతరం బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు వార్డు కార్యాలయం నుంచి బయటకు వచ్చి నిరసన తెలిపారు. సమావేశానికి హాజరైన 22 మంది కౌన్సిలర్లలో 12 మంది తీర్మానాలకు ఆమోదం తెలిపారని, దీంతో మొత్తం రూ.10 కోట్ల 21 లక్షల పనులకు ఆమోదం లభించిందని అనురాధ తెలిపారు. చైర్‌పర్సన్ తీరుకు నిరసనగా బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నామని ప్రకటించారు.

రైతు కుటుంబాలకు అండగా..

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రతి రైతు కుటుంబానికి అండగా ఉంటామని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం చైర్మన్ లెక్కల విఠల్‌రెడ్డి భరోసా ఇచ్చారు. కవాడిపల్లి గ్రామానికి చెందిన జంగయ్య 2022 జూలై 27న మృతి చెందాడు. అయితే సోమవారం సంఘం తరపున మృతుడి కుటుంబానికి రూ. 25వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి, మేనేజర్ ఐలేష్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకుడు రాజారాంచారి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు కౌంట్‌డౌన్ ప్రారంభం

పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌గౌడ్

ఆమనగల్లు: రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి కౌంట్‌డౌన్ ప్రారంభమైందని పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్ హెచ్చరించారు. రెండు నెలల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సోమవారం ఆమనగల్లులో విలేకరుల సమావేశంలో శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం అవినీతి, నియంత పాలనను సాగిస్తోందని ఆరోపించారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన సీఎం కేసీఆర్ ఒక్క హామీని కూడా అమలు చేయలేదని మండిపడ్డారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్వకుర్తిలో సమావేశం

ఆమనగల్లు మండలం రాంనుంతల గేటు వద్ద ఉన్న డీఎంకే ఫంక్షన్ హాలులో మంగళవారం కల్వకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సమావేశానికి ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి, మాజీ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు బాలాజీ సింగ్, సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి హాజరవుతున్నట్లు ఆయన తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ‘ఉప్పల’

తలకొండపల్లి: జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్ సోమవారం మిషన్ భగీరథ కార్పొరేషన్ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. హైదరాబాద్ ఎర్రమంజిల్ మిషన్ భగీరథ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు మిషన్ భగీరథ పథకం ఈఎన్‌సీ కృపాకర్‌రెడ్డి సమక్షంలో రిజిస్టర్‌లో సంతకం చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడారు. సీఎం కేసీఆర్ చైర్మన్‌గా వ్యవరిస్తున్న పథకానికి తనను వైస్ చైర్మన్‌గా నియమించడం గొప్ప విషయమన్నారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర టూరిజం మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు గోపాల్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా లింగం

మంచాల: కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘం ఐఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడిగా ఓరిగంటి లింగం గౌడ్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం మాజీ ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు భాస్కర్ రెడ్డి, సంజీవ, జంగయ్య, సంజీవ్‌కుమార్, రాజు, సతీష్, కుమార్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం సీఐగా గోవింద్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం సీఐగా గోవింద్‌రెడ్డిని నియమిస్తూ రాచకొండ పోలీస్ కమిషనర్ చౌహాన్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సీసీఎస్ ఎల్బీనగర్ నుంచి గోవింద్‌రెడ్డి ఇక్కడికి రాగా.. ఇబ్రహీంపట్నం సీఐగా పనిచేసిన రామకృష్ణ బదిలీపై వెళ్లారు.

పేదల సంక్షేమానికి కృషి చేయాలి

మంచాల: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి కృషి చేయాలని మంచాల జెడ్పీటీసీ నిత్యరెడ్డి అన్నారు. సోమవారం మంచాల మండలంలోని ఆగాపల్లి, కాగజ్‌ఘట్, చిత్తాపూర్, కొర్రవాణి తండా, లోయపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, జిల్లా అధికారులు సహకారంతో మంచాల మండలంలో కోట్లాది రూపాయాల నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.